# పంచ

పంచఖండాలతో నిండిన ప్రపంచానికి మన ప్రధాని శ్రీ నెహ్రూ 'పంచశీల' సూత్రాలు మార్గదర్శకములైనవి. భారతదేశ పురోభివృద్ధి పంచవర్ష ప్రణాళికలతో నే అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది అప్పుడే మనం ద్వితీయపంచవర్షప్రణాళికను రూపొందించి కార్యక్రమాన్ని సాగిస్తున్నాం. ఇంతటి ప్రాముఖ్యం గల యీ 'అయిదు' అంకెనుగూర్చి ఎంతైనా చెప్పవలసి ఉంది.

గణితశాస్త్రంలో ప్రతిసంఖ్యకీ కొంత చరిత్ర ఉంది. అందులో అయిదుకి ఒక ప్రత్యేకస్థానం, విశిష్టత ఉన్నది. ఇది ఒక శ్రేష్ఠ స్థానము గల సంఖ్య ఇదిబేసి సంఖ్య ప్రైమ్ కూడాను. ప్రైమ్ అంటే ఆ అంకచేతగాని, 1 చేతగాని తప్ప ఇంకేసంఖ్యచేత నిశ్శేషంగా భాగింపబడదు. నిజానికి అన్ని ప్రైమ్ సంఖ్యలు బేసి సంఖ్యలే రెండు ప్రైమ్సంఖ్యల మొత్తం మరో ప్రైమ్ సంఖ్య కానేరదు. ఈ ప్రైమ్‌కి ఎక్స్‌ట్ టరమ్ కనిపెటడం గణితశాస్త్రంలో ఒక సాధించలేని సమస్య. ఇంతవరకు కనిపెట్టిన అతి పెద్ద ప్రైమ్ సంఖ్య $2^{125}-1$. ఏసంఖ్యైనా అయిదు చేత నిశ్శేషంగా భాగింపబడాలంటే ఆసంఖ్యచివర సున్నకాని అయిదుకాని ఉండాలి.

అయిదుని హిందీలో 'పాంచ్' అంటారు. సంస్కృతంలో 'పంచ' అని అంటారు. తెలుగు తిథులలో అయిదవదానికి 'పంచమి' అనిపేరు. ఈ పంచమితో ఋషి పంచమి అని ఒక పండుగ తెలుగునాట వినవస్తుంది.

పంచమవేదమైన 'భారతము'న నాయకులు పంచపాండవులు. వీరందరికీ భార్య ద్రౌపది. ఆమెకు మరియొక పేరు 'పాంచాలి' పాంచాలదేశపురాజుకుమార్తె కనుక. అంతే కాని పంచపాండవులభార్య కనుక పాంచాలి కాదు.

నమఃశివాయః అనేది పూర్వులు మననం చేసే పంచాక్షరీ మంత్రం. అయిదోఏడు రాగానే అక్షరాభ్యాసంచేసి పిల్లవాని చేత వ్రాయించేతొలిపలుకులు ఓంనమఃశివాయః. మనందరిఇళ్ళలోనూ ఉండే పంచాంగము తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనెడి అయిదంగముల కలయిక.

సృష్టికారకుడైన బ్రహ్మకు పంచబ్రహ్మ అనిపేరు. అశరీరుడై తన వాడితూపులచే ఇతరులయందు శృంగార వికారములను పుట్టించు మన్మథునికి పంచబాణుడని పేరు. అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలం—పంచబాణాలు.

సంస్కృతములో ఒక ఉద్గ్రంథము పేరు పంచతంత్రము—మిత్రలాభము, మిత్రభేదము, సంధి, విగ్రహము, అసంప్రేక్ష్యకారిత్వము. ఇవి అందులోని భాగములు. ఏ దిక్కూ లేనివానికి దేవుడే అయిదో దిక్కు.

తెలుపు—అనేకరంగుల కలయిక అని భౌతిక శాస్త్రవేత 'న్యూటను' సిద్ధాంతము—కాని పంచవన్నెలు అని మన ప్రాచీనులు—తెలుపు, ఎఱుపు, నలుపు, ఆకుపచ్చ, పసిమి రంగులను ఊహించారు. పంచరంగులకీ, సప్తరంగులకీ ఉన్న సంబంధము అనూహ్యము. పంచరంగులు, చీరరంగులు—చెప్పక్కరలేదు - రకరకాల రంగులు.

ప్రపంచంలో ప్రతివ్యక్తిచేత వేనోళ్ళ మన్ననల నందుకుంటున్న మన ప్రధాని

కె. పార్థసారథి

ప్రవేశపెటిన పంచశీల సూత్రాలు అయిదు. ఈ పంచశీలను కొందరు పంచశీల అనికూడా వ్రాశారు. మనం పంచవర్ష ప్రణాళికలను అమలు జరుపుకొనడం నిజంగా గమనింపదగది త్రివర్ష ప్రణాళికలో, చతుర్థవర్ష ప్రణాళికలో జరుపుకొనక పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టడంలోనే ఉంది మన ప్రత్యేకత. మన 'రాష్ట్రపతి' నిర్ణీత కాలం అయిదు సంవత్సరాలే. మనదేశంలో అయిదేళ్లకొకసారి ఎన్నికలు జరుగుతున్నాయి. పంచఖండాలతో నిండిన ఈ ప్రపంచములో అగ్రరాజ్యాలు అయిదు. ఇదివరలో ఈ అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా: బ్రిటన్, ఫ్రాన్సు, జాతీయ చైనా.

కావ్యాలలో రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం, మాఘం, భారవి-పంచకావ్యాలు. చక్రం, శంఖం, గద, ఖడ్గం శార్ఙ్గము - శ్రీ మహావిష్ణుని పంచాయుధాలు. కావేరి, తుంగభద్ర, కృష్ణ, గౌతమి, భాగీరథి - పంచగంగలు. భూమి, నీరు, ఆకాశము, తేజస్సు, వాయువు అనేవి పంచభూతాలు. పంచభూతాలచేత పరివేష్టితుడైన మానవునకు పంచేంద్రియములున్నవి. వీటినే జ్ఞానేంద్రియములని కూడ అనటం పరిపాటి. అవి ఘ్రాణము, రసనము, చక్షువు త్వగింద్రియము, శ్రోత్రేంద్రియము. కర్మేంద్రియములుకూడా అయిదే. సామాన్య మానవుని కరచరణాలకి అయిదేసి వేళ్లుటాయి.

ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము,—పంచప్రాణాలు.

మానవుని జీవితములో బాల్యము, యౌవనము, కౌమారము, వృద్ధాప్యము పిదప అయిదవ దశ అయిన మరణమునకు పంచత్వమని పేరు.

స్వర్ణస్తేయము, సురాపానము, బ్రహ్మహత్య, గురుపత్నీ గమనము, దుష్టసహవాసము. — పంచమహాపాతకములు.

మృగరాజుకు మరియొక పేరు పంచాననము.

ఉదకము, పాలు, పెరుగు, నేయి, తేనె-పంచామృతాలు. కృష్ణపక్ష అష్టమి, కృష్ణపక్ష చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి, సంక్రాంతి — పర్వదినములు.

భక్ష్యము, భోజ్యము, లేహ్యము, చోష్యము, పానీయము - పంచభక్ష్యములు.

గోమూత్రము, గోమయము, గోఘృతము, గోదధి, గోక్షీరము, పంచగవ్యములు.

రాణి, వదిన, గురుపత్ని, భార్య తల్లి, తన్నుగన్న తల్లి—జననిగా పరిగణింపదగవారు.

పంచముఖేశ్వరరావు - ఒకని పేరు.

ఇంకా పంచమహాసముద్రాలు, పంచరత్నాలు, పంచరాగాలు, పంచలోహాలు, పంచాగ్నులు - కోకొల్లలు.

ఉపనయనంలో వడుగుకు పంచశిగలుంచేవారు. పెళ్ళయిన వ్యక్తికయితే అతని యజ్ఞోపవీతంలో పంచసూత్రాలుంటాయి. పూర్వం పెళ్ళిళ్ళు సావధానంగా అయిదు రోజులూ జరిగేవి. - ఇప్పుడు ఒక్కరోజు కూడా అక్కరలేదు.

గ్రామ పారిశుద్ధ్యానికి, క్రమశిక్షణ, న్యాయరక్షణకి పాటుపడేవారు పంచాయితీ మెంబర్లు.

వస్త్రధారణ కుపయోగపడే పంచలు అనేకరకాలు - సైనుపంచలు, లుంగీపంచలు, పొత్తుపంచలూ.

గణితంలోను, చరిత్రలోను, సారస్వతంలోను, సాహిత్యంలోను, సమాజంలోను, సాంఘికంగాను, రాజకీయంగాను, నాగరికంగాను ఇందుగల దందు లేదని ఎందెందు వెదకిన అందందే కనిపించెడి ఈ 'పంచ'లో ఏమహాత్యం, గొప్పదనం ఇమిడి ఉందో కదా! ★